క్లుప్తంగా

ఆరోగ్య శిబిరానికి విశేష స్పందన



పరీక్షలు నిర్వహిస్తున్న విద్యార్థులు

నగరి: ప్రభుత్వ డిగ్రీకళాశాలలో నిర్వహించిన ఆరోగ్య పరీక్షా శిబిరానికి విశేష స్పందన లభించింది. తమ ప్రయోగశాలల్లో నేర్చుకున్న పద్ధతులను ఉపయోగించి, హిమోగ్లోబిన్ అంచనా, రక్త గ్రూపు నిర్ధారణ, రక్తపోటు, నాడీ మాపన, బాడీ మాస్ ఇండెక్స్ తదితర ముఖ్యమైన ఆరోగ్య పరీక్షలను రూ.10 నామమాత్రపు చెల్లింపుతో అందించారు. విద్యార్థులు పలువురు ఈ పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా శిబిరం నిర్వహించిన విద్యార్థులు మాట్లాడుతూ పుస్తకాల్లో నేర్చుకున్నది నిజ జీవితంలో ఎలా పనిచేస్తుందో చూడడం, దాన్ని అమలు చేయడంతో ఎంతో అనుభవాన్ని ఇస్తుందన్నారు. ప్రిన్సిపల్ వేణుగోపాల్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపడానికే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జువాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో సమన్వయకర్త స్వాతి, అధ్యాపకులు అరుణకుమారి, సుహాసిని, గిరీషా, రేవతి, పంకజ, నవీన్, రమేష్, లాల్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులపై వివక్ష తగదు



మాట్లాడుతున్న మణి

శ్రీరంగరాజపురం: కూటమి ప్రభుత్వం వచ్చిన రోజు నుంచి సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరిపై వివక్ష చూపిస్తోందని వైఎస్‌ఆర్ సీపీ మండల కన్వీనర్ మణి అన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ సభ్యత్వం కార్డు ఉంటేనే సంక్షేమ పథకాలు అందిస్తున్నారని అన్నారు. మండలంలోని దాదాపు 70 మంది వరకు దివ్యాంగులకు నోటీసులు అందించడం దారుణమన్నారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించే వరకు వైఎస్‌ఆర్ సీపీ పోరాటం చేస్తుందని అన్నారు. కొన్ని సోషల్ మీడియాల్లో గంగాధర నెల్లూరు ఇన్‌చార్జి మార్పు అంటూ అసత్య ఆరోపణలు చేస్తున్నారని, వాటిని ఎవరు నమ్మవద్దని అన్నారు. ఇన్‌చార్జి కృపాలక్ష్మి ఆధర్వ్యంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఎంపీపీ సరిత జనార్దన్, మాజీ సర్పంచులు భూపతిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, బాలకృష్ణయాదవ్, రామచంద్రయాదవ్,బాబు, నాయకులు జయ, రామకృష్ణ, తిరకాని, నారాయణ, వాసు పాల్గొన్నారు.

చేనేత రంగాన్ని కాపాడండి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీ కుప్పయ్య

కార్వేటినగరం: చేనేత రంగాన్ని కాపాడి, నేత కార్మికులను ఆదుకోవాలని చేనేత కార్మిక యూనియన్ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కేవీ కుప్పయ్య అన్నారు. శుక్రవారం మండంలోని కొల్లాగుంట గ్రామంలో చేనేత కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ప్రకటించడం హర్షణీయమన్నారు. అయితే ఈ పథకాన్ని మగ్గం కలిగిన ప్రతి ఒక్కరికీ అందివ్వాలన్నారు. చేనేత వస్త్ర ఉత్పత్తులపై జీఎస్టీ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కాటన్, సిల్క్ జరీలపై 50 శాతం సబ్సిడీ ఇవ్వాలని, చేనేత మహిళలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. చేనేత అనుబంధ వృత్తుల వారికి ప్రభుత్వ పథకాలు అమలు చేసి, ముద్రా స్కీమ్ కింద రూ.5 లక్షలు వరకు బ్యాంకు ద్వారా వడ్డీ లేని రుణ సౌకర్యం కల్పించాలన్నారు. మాస్టర్ వీవర్లు, నేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలకు ప్రభుత్వం మార్కెట్ వసతులు కల్పించాలన్నారు. రిజర్వేషన్ చట్టాలను ప్రభుత్వం, అధికారులు పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్యలు చేసుకున్న చేనేత కార్మికులకు రూ.7 లక్షలు ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని, కార్మికులకు ఆరోగ్య పథకాన్ని అమలు చేయాలని, గ్రామాల్లో మినీ చేనేత క్లస్టర్లు, మెగా చేనేత క్లస్టర్లు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత దుకాణాలతో స్కూలుకు అవస్థలు

పూతలపట్టు(యాదమరి): చిత్తూరు–తిరుపతి జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల తరగతి గదులకు పక్కనే కొంతమంది వ్యాపారస్తులు అక్రమంగా దుకాణాలు ఏర్పాటు చేశారని పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ నేతాజీ శుక్రవారం పూతలపట్టు సీఐ కృష్ణమోహన్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ, ఈ ఆక్రమిత దుకాణాలు విద్యార్థినుల మరుగుదొడ్లకు పక్కన ఉండడంతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని, అంతేకాకుండా ప్రతి మంగళవారం చేపలు ఇక్కడ విక్రయిస్తుండడంతో తరగతి గదుల్లోకి దుర్వాసన చిమ్ముతోందని, ఆ దుకాణాలను వేరే ప్రదేశానికి మార్చేలా తగు చర్యలు తీసుకోవాలని సీఐను కోరారు.

దివ్యాంగులతో చెలగాటం



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు ముత్తు. ఇతను నగరి మున్సిపల్ పరిధిలోని కరకంతాపురం గ్రామంలో నివాసం ఉంటున్నాడు. ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. రోడ్డు ప్రమాదంలో కాలి ఎముక విరిగి తీవ్ర అస్వస్థతకు లోనయ్యాడు. గతంలో ఇతన్ని పరీక్షించిన వైద్యులు ఇతనికి 68 శాతం వైక్యలం ఉన్నట్లు నిర్ధారించగా పెన్షన్ అందుకుంటూ జీవిస్తున్నాడు. ప్రస్తుత ప్రభుత్వం నిర్వహించిన సదరం క్యాంపునకు వెళ్లగా రీ వెరిఫికేషన్‌లో 48 శాతం లోపు మాత్రమే వైకల్యం ఉందని తేల్చారు. ఇప్పటికే అధికారులు నోటీసులు కూడా అందించారు. దీంతో ఆవేదనకు హద్దులేకుండా పోయింది.



సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు ఆస్పత్రి వద్ద పడిగాపులు కాస్తున్న దివ్యాంగులు

- దివ్యాంగ, ఆరోగ్య పెన్షన్ల తగ్గింపు పనిలో కూటమి సర్కారు
- కొన్నింటిని ఓఏపీ పెన్షన్లుగా మార్పు
- నడవలేని వారికి కూడా 40 శాతం కంటే తక్కువ ఉందని నోటీసులు

నగరి: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 ఏళ్లకే వృద్ధాప్య పింఛన్ హామీని గాలికొదిలేసిన కూటమి సర్కారు ప్రస్తుతం ఉన్న పింఛన్లు, ఇస్తున్న సాయానికి కోత పెట్టే పనిలో నిమగ్నమైంది. తొలి విడతగా దివ్యాంగ, ఆరోగ్య పింఛన్లపై కన్నేసింది. నగరి నియోజకవర్గ పరిధిలో వైకల్యం, పక్షవాతం, కిడ్నీ, లివర్ ఇతర ఆరోగ్య సమస్యలతో పింఛన్ పొందుతున్న లబ్ధిదారులు 3912 మంది ఉండగా, లేవలేని పరిస్థితిలో ఉండి ఆరోగ్య పింఛన్ పొందేవారు 194 మంది ఉన్నారు. దివ్యాంగులకు నెలకు రూ.6,000, ఆరోగ్య పింఛన్ లబ్ధిదారులకు రూ.15,000, ఇతర సామాజిక పింఛన్లకు రూ.4,000 చొప్పున సాయం అందుతోంది. వెరిఫికేషన్, రీ అసెస్మెంట్ పేరిట లబ్ధిదారులకు ఇటీవల వైద్య బృందాలతో వైకల్య నిర్ధారణ, ఆరోగ్య పరీక్షలు చేయించారు. ఆరోగ్య పింఛన్ లబ్ధిదారులకు పరీక్షలు చేసి 58 మందిని దివ్యాంగ పెన్షన్ కేటగిరికి మార్చేశారు. ముగ్గురిని ఓఏపీ పెన్షనర్లుగా మార్చేశారు. 11 మందిని తొలగించారు. దివ్యాంగ పెన్షన్లలో 3912 మంది ఉండగా వీరిని పరీక్షించి 146 మందిని ఓఏపీగా మార్చేయగా 533 మందిని తొలగించారు.

పింఛన్ నిలిపేస్తామంటూ నోటీసులు

దివ్యాంగ పెన్షన్లలో మార్పుచేయగా మిగిలిన వారికి తాత్కాలిక వైకల్యంగా, 40 శాతంలోపు ఉన్నట్టుగా సర్టిఫికెట్లు జారీ చేయడంతో ఇప్పుడు వారి పింఛన్లు ఆగిపోయే పరిస్థితి వచ్చింది. వీరిలో పుట్టుక నుంచి వైకల్యంతో బాధపడుతున్న వారు, ఎన్నో ఏళ్లుగా పింఛన్ తీసుకుంటున్న వారు ఎంతోమంది ఉన్నట్టు చెబుతున్నారు. వీరందరికీ వైకల్య శాతం తక్కువ, తాత్కాలిక వైకల్యం కారణంగా పింఛన్ నిలిపివేస్తున్నట్లు మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయాల నుంచి నోటీసులు అందడం లబ్ధిదారులను ఆందోళనకు గురి చేస్తోంది. నోటీసులు తీసుకుని సహాయకులతో కలిసి ప్రభుత్వ కార్యాలయాలకు పరుగులు తీస్తున్నారు. తమను మరోసారి పరీక్షించి న్యాయం చెయ్యాలంటూ కోరుతున్నారు.

ఒక్కశాతంతో పింఛన్ దూరం చేశారు

ఆరోగ్య పెన్షన్ రూ.15 వేలు అందుకోవాలంటే 85 శాతానికి ఎక్కువగా ఉండాలని ప్రభుత్వం నిబంధన విధించింది. గతంలో 90 శాతం వైకల్యం ఉంటూ ఆరోగ్య పెన్షన్ తీసుకుంటున్న వారిని రీవెరిఫికేషన్ చేసి వారి వైకల్యాన్ని 85 శాతంగా నిర్ధారించి సర్టిఫికెట్ అందించారు. 85 శాతం ఉన్నా ఆరోగ్య పెన్షన్ రాదని దాని కంటే ఒక్క శాతమైనా ఎక్కువగా ఉంటేనే వస్తుందని అధికారులు తేల్చేయడంతో ఒక్కశాతంతో వైకల్యం ఎలా పోతుందో పెన్షన్‌దారులకు మింగుడు పడడం లేదు.

దివ్యాంగుల పెన్షన్లు, మార్పులు, తొలగింపు పెన్షన్ల వివరాలు

మండలం/ మున్సిపాలిటీ	దివ్యాంగ పెన్షన్లు	ఓఏపీగా మార్చినవి	తొలగించిన పెన్షన్లు
నగరి మున్సిపాలిటీ	829	12	96
నగరి మండలం	579	15	64
పుత్తూరు మున్సిపాలిటీ	574	13	47
పుత్తూరు మండలం	427	42	92
విజయపురం మండలం	456	20	73
నింద్ర మండలం	502	16	77
వడమాలపేట మండలం	545	28	84
మొత్తం	3912	146	533

ఆరోగ్య పెన్షన్లు, తొలగింపు, మార్పులు పెన్షన్ల వివరాలు :

మండలం/ మున్సిపాలిటీ	ఆరోగ్య పెన్షన్లు	దివ్యాంగ పెన్షన్లుగా	ఓఏపీగా మార్చినవి	తొలగించినవి మార్చినవి
నగరి మున్సిపాలిటీ	4	1	-	-
నగరి మండలం	20	12	1	2
పుత్తూరు మున్సిపాలిటీ	28	8	-	-
పుత్తూరు మండలం	14	1	-	2
విజయపురం మండలం	73	32	2	7
నింద్ర మండలం	21	2	-	-
వడమాలపేట మండలం	34	2	-	-
మొత్తం	194	58	3	11

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో రూ.1.16 లక్షల జరిమానా

నగరి: మద్యం మత్తులో వాహనాలు నడపడం, బహిరంగ మద్యం సేవించడం కేసులో 26 మంది పట్టుబడగా వారిని శుక్రవారం కోర్టులో హాజరుపరిచారు. కేసు విచారించిన ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జానకి నిందితులు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున పది మందికి రూ.లక్ష జరిమానా విధించారు. బహిరంగంగా మద్యం తాగిన కేసులో 16 మంది పట్టుబడగా ఒకరికి రూ.1000 చొప్పున రూ.16 వేలు జరిమానా విధించారు. మొత్తం 26 కేసుల్లో రూ.1.16 లక్షల జరిమానా విధించినట్లు సీఐ విక్రమ్ తెలిపారు.

జెడ్పీ నిధులతో తాగునీటి సమస్య పరిష్కారం



పూజలు చేసి తాగునీటి కొత్తభోరు వేస్తున్న జెడ్పీటీసీ సభ్యులు అన్బలగన్

పాలసముద్రం: మండలంలోని క్రిష్ణజమ్మపురం పంచాయతీ ఇందిరానగర్‌లో శుక్రవారం జెడ్పీ నిధులతో వేసిన బోరుతో తాగునీటి సమస్య పరిష్కరించారు. జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్ మాట్లాడుతూ గత వేసవిలో కూడా ఇందిరానగర్ గ్రామస్తులు తాగునీటికి ఇబ్బందులు పడ్డారన్నారు. ప్రస్తుతం తాగునీటి సమస్యలు పరిష్కారం కావాలంటే కొత్త బోరు వేసి మోటారు అమర్చితే సమస్య పరిష్కారమవుతుందని గ్రామస్తులు తెలిపారన్నారు. రూ.5 లక్షలు బోరు వేసి, మోటారు అమర్చడానికి నిధులు మంజూరు చేశామన్నారు. చాలా రోజులుగా తాగు నీటికి ఇబ్బందులు పడుతున్న ప్రజలు కొత్త బోరు వేసి, నీరు పుష్కలంగా రావడంతో సంతోషం వ్యక్తం చేశారు.

చస్తే.. పూడ్చడానికి స్థలం ఎక్కడ?

- తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన
- వారంలో పరిష్కరిస్తాం: తహశీల్దార్



శ్మశాన స్థలం కోసం నిరసన

విజయపురం: చనిపోతే పూడ్చడానికి స్థలం లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని, చస్తే...పూడ్చడానికి స్థలం చూపాలని విజయపురం దక్షిణ ఆదిఆంధ్రవాడకు చెందిన గ్రామస్తులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయపురం దక్షిణ ఆదిఆంధ్రవాడలో సుమారు 60కిపైగా కుటుంబాలు నివాసం ఉంటున్నాయని తెలిపారు. అయితే ఇంత వరకు శ్మశానవాటిక లేదన్నారు. ఉన్న కొద్దిపాటి స్థలాన్ని ఓ రైతు ఆక్రమించుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కాలనీలో ఎవరైనా చనిపోతే పూడ్చడానికి కూడా స్థలం లేక నానా తంటాలు పడుతున్నామని, కాలువ గట్టు, కుంటల్లో దహన క్రియలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఎన్ని సార్లు అర్జీలు ఇచ్చినా రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోలేదన్నారు. జిల్లా స్థాయి అధికారులకు కూడా పలుమార్లు ఫిర్యాదు చేసినట్లు వారు గుర్తు చేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు శ్మశానం స్థలంతోపాటు దారి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

క్షయ నిర్మూలన అందరి బాధ్యత



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ చంద్రమౌళి

పుత్తూరు: క్షయ వ్యాధి పెద్ద ఆరోగ్య సమస్యగా ఉందని. దీనిని పూర్తిగా నిర్మూలించాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బి.చంద్రమౌళి అన్నారు. శుక్రవారం కళాశాలలో క్షయ వ్యాధి నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి క్షయ రహిత భారత్ పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. అంటు వ్యాధి అయిన ఈ క్షయ వ్యాధి నుంచి పేద బలహీన వర్గాల ప్రజలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఇందుకు తగిన కార్యాచరణతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ప్రజల సహకారంతోనే ఈ కార్యక్రమం విజయవంతం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు శ్రీనివాసులు, బాబురావు, వాసవి, శాంసన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు ఫిట్‌నెస్‌తో ఉండాలి



పోలీసులకు వ్యాయామంపై శిక్షణ ఇస్తున్న డీఎస్పీ

నగరి: ఫిట్‌నెస్‌తో ఉండడం పోలీసు ప్రధాన కర్తవ్యమని డీఎస్పీ అబ్దుల్ అజీజ్ అన్నారు. శుక్రవారం వారాంతపు డ్రిల్‌లో భాగంగా స్థానిక కేవీకే మైదానంలో డివిజన్ పరిధిలోని పోలీసులకు బాడీ ఫిట్‌నెస్‌కు సంబంధించిన శిక్షణ అందించారు. వ్యాయామం చేసే పద్ధతులు, తీసుకోవాల్సిన పౌష్టికాహారం, సెల్యూట్ చేసే విధానాలపై ప్రత్యేక శిక్షణ అందించారు. ప్రత్యక్షంగా వ్యాయామం చేస్తూ సమావేశానికి హాజరైన పోలీసులు అందిరితో చేయించారు. అనంతరం క్రమశిక్షణగా ఉండడంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నగరి, నగరి రూరల్, కార్వేటినగరం సీఐలు విక్రమ్, భాస్కర్, హనుమంతప్ప, ఎస్‌ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

నగరిలో కుక్కల వేట





కుక్కలను పట్టి తీసుకెళ్తున్న మున్సిపల్ సిబ్బంది, కుక్కలను వాహనంలోకి చేర్చుతున్న సిబ్బంది

నగరి: మున్సిపల్ పరిధిలో కుక్కల బెడద ఎక్కువగా ఉండడం, ఇటీవల జిల్లాలో చిన్నారిపై కుక్కలదాడి సంఘటనలు చోటుచేసుకోవడం, హ్యూమన్ రైట్స్ రాష్ట్ర కార్యదర్శి జ్యోతినాయుడు సభ్యులతోపాటు వెళ్లి కమిషనర్ కృష్ణారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనలపై మున్సిపల్ అధికారులు స్పందించారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో కుక్కల వేట ప్రారంభించారు. కుక్కలు పట్టడంలో ప్రత్యేక శిక్షణ పొందినవారిని రప్పించి కుక్కలను పట్టి తిరుపతి అనిమల్ కేర్‌లాండ్‌కు తరలించినట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం తెలిపారు. సచివాలయ సిబ్బంది, మున్సిపల్ కార్మికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై కేసు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఇసుక అక్రమ రవాణాపై బీఎన్‌ఆర్‌పేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. చిత్తూరు మండలం అనంతాపురం గ్రామం వద్ద అక్రమ ఇసుక లారీ గ్రామస్తులు కంట పడింది. దీంతో ఈ లారీని గ్రామస్తులు పోలీసులకు అప్పగించారు. ఎస్‌ఐ నాగసౌజన్య ఈ లారీని అదుపులోకి తీసుకుని కేసు తిరువల్లూరు జిల్లాకు చెందిన సరసంథన్, పురుషోత్తం, నెల్లూరుకు చెందిన మహేష్‌రెడ్డిలపై కేసు నమోదు చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలిగా నిషిధ



పుత్తూరు: రాష్ట్ర బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలిగా పుత్తూరుకు చెందిన ఎం.నిషిధరాజును నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నిషిధ 2012 నుంచి పార్టీలో చురుకైన పాత్ర పోషించిన నేపథ్యంలో ఆమెకు రాష్ట్ర పదవి దక్కినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. గతంలో చిత్తూరు జిల్లా పార్టీ వైస్ ప్రెసిడెంట్‌గా, కేరళ రాష్ట్ర ఇన్‌చార్జి మహిళా మోర్చా అధ్యక్షురాలిగా పనిచేసిన అనుభవం ఆమెకు ఉంది. రాష్ట్ర పదవి వచ్చిన నేపథ్యంలో ఆమె మాట్లాడుతూ పార్టీ అధినాయకత్వం తనకు అప్పగించిన బాధ్యతకు న్యాయం చేకూరుస్తానని తెలిపారు.

సీపీఐ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

నగరి: ఒంగోలులో నిర్వహించే ర్యాలీ, బహిరంగ సభను జయప్రదం చేయాలంటూ సీపీఐ నగరి నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య, పట్టణ కార్యదర్శి వేలన్ శుక్రవారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అనే నినాదంతో ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న పరిశ్రమను బీజేపీ ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలకు అమ్మడానికి చూస్తోందన్నారు. దీనికి వ్యతిరేకంగా 500 రోజులుగా ఉద్యోగ కార్మిక సంఘాలు పోరాటాలు చేస్తున్నప్పటికీ స్పందించకపోగా ప్రైవేటీకరణకు పిలుపు ఇవ్వడాన్ని సీపీఐ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు పథకంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లక్షలాది ఆటో కార్మికుల కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. ఈ సమస్యలన్నింటిపైనా శనివారం నిర్వహించే మహాసభల్లో చర్చిస్తామన్నారు. పట్టణ నాయకులు బాషా, విజయకుమార్, సుబ్రహ్మణ్యం, యేసయ్య, ఏఐటీయూసీ నాయకులు దశరథ, సురేష్, రాజవేలు పాల్గొన్నారు.

అండర్ బ్రిడ్జి.. అంతులేని వ్యథ

- నీళ్లలోనే విద్యార్థుల రాకపోకలు
- ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?
- రైల్వే అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట
- ఆందోళనకు సిద్ధమవుతున్న గ్రామస్తులు





ప్రవేశం లేదంటూ రైల్వే అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు, నీళ్లలోనే విద్యార్థుల రాకపోకలు

పుత్తూరు: ఇటీవల కాలంలో తిరుపతి నుంచి చెన్నై రైల్వే మార్గంలో పలుచోట్ల రైల్వే అధికారులు అండర్ బ్రిడ్జిలను నిర్మించారు. నిర్మించిన ప్రతి అండర్ బ్రిడ్జిలో వర్షపునీరు నిలిచిపోయి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదరవుతున్నాయి. ఈ రైల్వే అండర్ బ్రిడ్జిలను దాటుకొంటూ పలు గ్రామాల ప్రజలు తమ గమ్య స్థానాలకు చేరాల్సి ఉంది. అయితే చిన్నపాటి వర్షాలకు సైతం అండర్ బ్రిడ్జిల్లో వర్షపు నీరు నిలిచిపోతుండడంతో గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పుత్తూరు పట్టణానికి కూతవేటులోని రాచపాళెం(ఈశ్వరాపురం) శల్యవైద్యానికి పెట్టింది పేరు. ఈ గ్రామానికి శల్య వైద్యం కోసం ప్రతిరోజూ వందలాది మంది రోగులు ఇక్కడి వస్తుంటారు. రాచపాళెం రోడ్డు వద్ద బస్సు దిగిన రోగులు గ్రామం లోపల ఉన్న శల్య వైద్యశాలలకు చేరాలంటే ముందుగా రైల్వే అండర్ బ్రిడ్జి దాటాల్సి ఉంది. అందులో మొలలోతు నీళ్లు నిలిచి ఉండడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆటోల సాయంతో అటువైపు దాటడానికి ప్రయత్నించినా ఆటోవాలాలు సైతం ధైర్యం చేసే పరిస్థితి లేదు. ఇక ఈ అండర్ బ్రిడ్జిని కలుపుతూ 7 గ్రామాల ప్రజలు పుత్తూరుకు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రత్యేకించి విద్యార్థులు సైకిళ్లపై స్కూళ్లకు వెళ్లిరావాల్సిన పరిస్థితి. విద్యార్థులు తెలిసి తెలియక నీళ్లల్లోకి దిగి ప్రాణాల మీదకు ఎక్కడ తెచ్చుకుంటారోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

గేట్ నెంబర్ 59 మూసివేతతో సమస్య

రాచపాళెం గ్రామానికి వెళ్లేందుకు గతంలో ఎల్‌సీ గేట్ నెంబర్ 59 మీదుగా రాకపోకలు సాగించేవారు. ఈ గేటును శాశ్వతంగా మూసివేసి అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయడంతో సమస్య మొదలైంది. గత రెండేళ్లుగా ఎప్పుడు నాలుగు చినుకులు పడినా అండర్ బ్రిడ్జిలో నీరు చేరి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. నీళ్లు నిల్వ లేకుండా రైల్వే అధికారులు తగిన చర్యలు చేపట్టకపోవడమే సమస్యకు ప్రధాన కారణం. కనీసం వర్షపు నీరు నిలిచే సమయంలో మోటార్ల సాయంతో నీటిని తోడే ఏర్పాట్లను సైతం రైల్వే అధికారులు చేపట్టకపోవడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పైగా ఈ సబ్‌వేలో నీరు నిలిచి ఉన్నందున వాహనదారులకు ప్రవేశం లేదు అంటూ రైల్వే అధికారులు బోర్డును ఏర్పాటు చేయడంపై గ్రామస్తులు మండిపడుతున్నారు. అండర్‌బ్రిడ్జిల్లో రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. దీనిపై రాచపాళెంతోపాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో సంతకాలు సేకరించి రైల్వే బోర్డు చైర్మన్‌కు, రైల్వే మంత్రికి వినతిపత్రం అందజేశారు.



స్కూటర్‌పై ధైర్యంగా మహిళలు



ఆటోవాలా సాహసం

మొక్కలు నాటిన అధ్యాపకులు



మొక్కలు నాటుతున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

నగరి: కళాశాల ఆవరణలో పచ్చదనాన్ని పెంపొందించడం కోసం స్థానిక ఎంఎస్ఎంఎన్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల అధ్యాపకులు మొక్కలు నాటారు. గ్లోబల్ ట్రీ బ్యాంక్ వారు 60 మొక్కలు ఉచితంగా అందించగా శుక్రవారం వాటిని కళాశాల ఆవరనలో నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జి.మంజుల మాట్లాడుతూ మొక్కల పెంపకం ద్వారా పచ్చదనం పెరగడంతోపాటు పర్యావరణ కాలుష్య నివారణ కూడా సాధ్యమన్నారు. నాటడంతోపాటు వాటిని పెంచే బాధ్యతను అధ్యాపకులు, విద్యార్థులు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ ట్రీ బ్యాంక్ అధ్యక్షుడు జాన్సన్, ప్రధాన కార్యదర్శి నవశ్శివాయం, ఉపాధ్యక్షుడు రాజవేలు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి బ్రహ్మానందం, అధ్యాపకులు పాల్గొన్నారు.